క్లుప్తంగా

108 వాహనంలో ప్రసవం



108లో జన్మించిన శిశువును చూపుతున్న సిబ్బంది

ఏలేశ్వరం: పట్టణానికి చెందిన గర్భిణి ఆదివారం 108 వాహనంలో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే...స్థానిక గొల్లలమెట్టకు చెందిన కొల్లా సూర్యకుమారికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది ఆమెను కాకినాడ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో పెద్దాపురం మండలం పులిమేరు వద్ద పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఈఎంటీ సీతాదేవి, పైలెట్ పవన్ కుటుంబ సభ్యుల సహకారంతో ఆమెకు పురుడు పోశారు. సూర్యకుమారికి ఇది మూడో కాన్పుకాగా, ప్రస్తుతం తల్లీబిడ్డా ప్రత్తిపాడు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

యోగాపై శిక్షణ తరగతులు

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లి అరుణాచలక్షేత్రంలో ఆదివారం జ్ఞానగ్రామ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, యోగా గురువు కాన్షీజీ యోగాపై శిక్షణ తరగతులు నిర్వహించారు. భక్తులకు యోగా, ధ్యానంపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. భక్తులు ఈ యోగా క్లాసులను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ప్రత్తిపాడు సీటు బీసీలకు కేటాయించాలి

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు అసెంబ్లీ స్థానాన్ని బీసీలకు కేటాయించాలని నియోజకవర్గ బీసీ ఐక్య సంఘర్షణ సమితి అధ్యక్షుడు ఏపూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లాలోని ఎమ్మెల్యేలు, మున్సిపల్ కార్పొరేషన్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్, జిల్లా పరిషత్, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవుల్లో అధికశాతం కాపు సామాజిక వర్గీయులకే కట్టబెట్టారన్నారు. కాకినాడ జిల్లాలో 9 లక్షల మంది బీసీలు ఉన్నప్పటికీ ప్రాధాన్యం ఉన్న పదవులు కట్టబెట్టలేదన్నారు. రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు టికెట్ కేటాయింపులో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని శ్రీనివాసరావు కోరారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



జె.అన్నవరంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

ఏలేశ్వరం: మండలంలోని జె.అన్నవరంలో ఆదివారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన చర్చి ఆధ్వర్యంలో సొసైటీ అధ్యక్షుడు కొండపల్లి వెంకటేశ్వరరావు వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కాలారి సత్తిబాబు, సింగిరెడ్డి సోమన్నదొర, ఉమ్మిటి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

202 మందికి వైద్య పరీక్షలు



హంసవరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ దయానందరావు

తుని రూరల్: మండలంలోని హంసవరంలో తేటగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ అన్వేషి పర్యవేక్షణలో ఆదివారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ రాయి మేరీఅవినాష్ ప్రారంభించారు. గ్రామంలోని 202 మంది రోగులకు డాక్టర్ దయానందరావు షుగర్, బీపీ, హెచ్‌బీ, తదితర వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, డీఈఓ సరస్వతీ, ఏఎన్‌ఎం సునీత, ఎంఎల్‌హెచ్‌పీ పుష్పా తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి ఏపీఓ మృతి



మధుసూదనరావు (ఫైల్)

ఏలేశ్వరం: మండలంలో ఉపాధి ఏపీఓగా పని చేస్తున్న ఐ.మధుసూదనరావు (52) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. మధుసూదనరావుకు స్వగ్రామం పిఠాపురంలో తెల్లవారుజామున గుండెపోటు రాగా కాకినాడలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వివాదరహితుడిగా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండే ఏపీఓ మృతి చెందడంతో మండలంలో విషాదం నెలకొంది. ముందురోజు కార్యాలయంలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన ఏపీఓ గుండెపోటుతో మృతి చెందడాన్ని సిబ్బంది జీర్ణించుకోలేకపోతున్నారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సంతాపం తెలిపారు.

ప్రకృతి సాగు.. లాభాలు బాగు

- మెట్టలో ఆసక్తి చూపుతున్న రైతులు
- ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- టీటీడీకి సైతం ధాన్యం ఎగుమతికి సన్నాహాలు



ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న రైతులు



ధాన్యాన్ని కాటా వేసి దిగుబడి అంచనా వేస్తున్న రైతులు

గోకవరం: పంటల సాగులో రసాయన ఎరువులు వినియోగించడం ద్వారా ఆహార ఉత్పత్తులు కలుషితమవుతున్నాయి. వీటిని తిన్న ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. రసాయన ఎరువులు ధరలు పెరగడంతో సాగు వ్యయం కూడా అధికమై రైతులకు ఆశించిన స్థాయిలో లాభాలు రావడం లేదు. ఈ పరిస్థితిని గుర్తించిన రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని సాధించే ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రకృతి వ్యవసాయం సాగిస్తున్న రైతులకు ప్రోత్సాహం అందిస్తోంది. దీంతో మెట్టలో ఏటా ప్రకృతి సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

2,870 ఎకరాల్లో సాగు

నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో చేపట్టిన ప్రకృతి వ్యవసాయం ఆశాజనకంగా మారింది. గోకవరం మండలంలో కొత్తపల్లి క్లస్టర్‌గా 2016–17లో రైతులు పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం చేపట్టారు. ప్రారంభంలో 1057 మంది రైతులతో సుమారు 577 ఎకరాల్లో సాగు చేపట్టగా ఫలితాలు ఆశాజనకంగా వచ్చాయి .దీంతో ఈ ఏడాది కొత్తపల్లి, కామరాజుపేట, గంగంపాలెం, తిరుమలాయపాలెం, గుమ్మళ్లదొడ్డి క్లస్టర్లలో సుమారు మూడు వేల మంది రైతులు 2,870 ఎకరాల్లో ప్రకృతి పద్ధతిలో వరి సాగు చేశారు. అలాగే మామిడి, జీడిమామిడి పండ్ల తోటలను 170 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వీరిలో అధిక సంఖ్యలో మహిళలు కూడా ఉన్నారు. మండలంలోని వెంకటాపురం, చిన్నూరు గ్రామాల్లో సుమారు వంద మహిళలు ప్రకృతి వ్యవసాయం సాగిస్తూ అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు.

టీటీడీకి పంపేందుకు ప్రయోగాత్మకంగా..

తిరుమల తిరుపతి దేవస్థానానికి పంపించేందుకు ఈ ఏడాది ఖరీఫ్‌లో ప్రయోగాత్మకంగా ఐదెకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం ఈ పంట కోత దశలో ఉంది. రబీలో మొత్తం ఐదు క్లస్టర్లలో 50 ఎకరాల్లో 50 మంది రైతులు ప్రకృతి సాగు చేసి టీటీడీకి ధాన్యం ఎగుమతి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయంలో అధిక దిగుబడులు వచ్చాయి. ఎకరాకు 30 బస్తాల వరకూ దిగుబడి వచ్చినట్టు రైతులు తెలిపారు. వెంకటాపురానికి చెందిన మహిళా రైతు అంకంరెడ్డి సూరీడమ్మ 30 బస్తాలు, గండేపల్లి వెంకట్రావు అనే రైతు కొత్తపల్లిలో ఎకరాకు 20 బస్తాల దిగుబడి సాధించారు. ఎటువంటి రసాయనాలు లేకుండా కేవలం ఘన, ద్రవ జీవామృతాలతో సాగు చేస్తుండటంతో ఈ సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రకృతి సాగులో పండించిన బియ్యాన్ని స్థానిక ప్రజలు, పలువురు అధికారులు కొనుగోలు చేస్తున్నారు. ఆర్‌జీఎల్, పీఎల్ రకాల ధాన్యం 75 కేజీల బస్తా రూ.2 వేలు, సాంబా మసూరి రకం రూ.2,500 వరకూ విక్రయిస్తున్నారు. రసాయనిక ఎరువులు వాడి పండించిన బియ్యం కంటే ఈ బియ్యం ధర అధికంగా ఉన్నప్పటికీ ప్రజలు వీటినే కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడి నుంచి హైదరాబాద్, బెంగళూరుకు ఎగుమతి చేస్తున్నారు.

రైతులకు అవగాహన



ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖ కృషి చేస్తోంది. ప్రకృతి సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సాగు చేపట్టిన రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. తిరుమల తిరుపతి దేవస్థానానికి బియ్యం పంపేందుకు రబీలో ఐదు క్లస్టర్లలో 50 మంది రైతులు ప్రకృతి పద్ధతిలో వరి సాగు చేస్తున్నారు.

– వరలక్ష్మి, ఏపీసీఎన్ఎఫ్ కొత్తపల్లి క్లస్టర్ ఎంసిఏ, గోకవరం మండలం

ఆశించిన స్థాయిలో దిగుబడి



గత కొన్నేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. వారి సూచనలతో ఏటా ఈ వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధిస్తున్నాను. ఈ ఏడాది వరిలో అధిక దిగుబడి రావడంతో మిగిలిన రైతులు సైతం ప్రకృతి సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

– అంకిరెడ్డు సూరీడు, మహిళా రైతు, రామన్నపాలెం, గోకవరం మండలం

క్వారీ లారీలను అడ్డుకున్న గ్రామస్తులు



మల్లంపేటలో గ్రామస్తులు అడ్డుకున్న క్వారీ లారీలు

రౌతులపూడి: మండలంలోని మల్లంపేటలో నల్లరాయిని తరలించే క్వారీ లారీలను ఆదివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామం మీదుగా విచ్చలవిడిగా క్వారీలారీలు తిరగడంతో కాలుష్యం పెరిగిపోతోందన్నారు. లారీలు మితిమీరిన వేగంతో వెళ్లడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చేశారు. సమస్యను లారీ యజమానుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నారు. గ్రామం మీదుగా రవాణా సాగించే లారీలు నెమ్మదిగా వెళ్లాలని, లోడు తగ్గించాలని, దుమ్ము, ధూళి వ్యాపించకుండా ఎప్పటికప్పుడు రహదారిని నీటితో తడపాలని డిమాండ్ చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

రౌతులపూడి: మండలంలోని ములగపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విజన్ ప్రాథమిక కంటి ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ తమరాడ సత్యనారాయణ ప్రారంభించారు. కంటి వైద్య నిపుణులు 69 మంది రోగులకు కంటి పరీక్షలు చేశారు. వారిలో 12 మందిని శస్త్రచికిత్స కోసం రాజమహేంద్రవరం తరలించినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వై.సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



మల్లిసాలలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని మల్లిసాలలో నూతనంగా మంజూరైన 29 మంది లబ్ధిదారులకు ఆదివారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛన్ల సొమ్ము దఫదఫాలుగా పెంచుతూ పేదలను ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. భవిష్యత్‌లో పింఛన్ల సొమ్ము రూ.3 వేల చేయాలనే దృఢసంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారన్నారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇళ్ల అప్పారావు కాపు, గ్రామ సర్పంచ్ సర్వసిద్ధి నూకరత్నం, అత్తులూరి శ్రీను, సర్వసిద్ధి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



జగ్గంపేట: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాల స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి వేదాశీస్సులు అందజేశారు. ఎంపీపీ అత్తులూరి నాగబాబు, గ్రామ ఉప సర్పంచ్ బండారు రాజా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, పార్టీ నాయకులు అత్తులూరి సాయిబాబు, బేకరి బాబు తదితరులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు

కిర్లంపూడి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కోటనందూరులో విద్యార్థులకు కథలు చెబుతున్న లైబ్రేరియన్ నాగలక్ష్మి

కోటనందూరు: స్థానిక శాఖా గ్రంథాలయాన్ని పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ బి.నాగరత్నం కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం 'చదవటం మాకిష్టం' కార్యక్రమంలో భాగంగా సండే స్టోరీ టైం నిర్వహించారు. గ్రామంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు కథలు చెప్పారు. స్పోకెన్ ఇంగ్లిషు నేర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి నాగరత్నం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి లైబ్రరీకి వివిధ నీతికథలు, జనరల్ నాలెడ్జ్(జీకే) పుస్తకాలు వచ్చాయన్నారు. దినపత్రికలు, వారపత్రికలతో పాటు అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రంథాలయ సేవలను యువత, పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



కబడ్డీ టోర్నీ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని కామరాజుపేటలో ఏర్పాటు చేసిన కబడ్డీ టోర్నమెంట్‌ను ఆదివారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందన్నారు. సంక్రాంతికి యువత జూదాల వైపు కాకుండా క్రీడల వైపు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పాటి రాంబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, సీనియర్ నాయకులు దాసరి రమేష్, సుంకర వీరబాబు, శింబోతుల అచ్చిరాజు, జాజుల ప్రసాద్, ముమ్మన అర్జునరావు, గోపాల బాబులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



తిరుమాలిలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సింగిలిదేవి సత్తిరాజు సూచించారు. మండలంలోని తిరుమాలిలో బీజేపీ జిల్లాకార్యదర్శి కొల్లా శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. ప్రధాని మోదీ పాలనతో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. గ్రామ శక్తి కేంద్రప్రముఖ్‌గా ఎలుబండి సూరిబాబును నియమించారు. తొలుత బీజేపీ జిల్లా క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాకే కృష్ణారావు, ఏనుగు ధర్మరాజు, కురాకుల రాజా, పతివాడ వెంకటేశ్వరరావు, బండారు సూరిబాబు, మదినే బాబ్జీ, కురాకుల చంటి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం



గుమ్మళ్లదొడ్డిలో వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో వల్మీక వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పండితులు తెల్లవారుజామున స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.విశేష సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ధనుర్మాసం సందర్భంగా గ్రామంలోని శ్రీరామగిరి కొండపై వేంచేసిన కోదండరామ సహిత రమాసత్యనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరి కుప్ప, గడ్డివామి దగ్ధం



గోపాలపట్నంలో దగ్ధమైన వరి కుప్ప, గడ్డివామి

తొండంగి: మండలంలోని గోపాలపట్నంలో ఆదివారం మధ్యాహ్నం వరికుప్ప, గడ్డివామి దగ్ధమైన ఘటనలో రూ.లక్ష ఆస్తినష్టం సంభవించింది. వివరాల్లోకి వెళితే.. గోపాలపట్నం గ్రామానికి చెందిన మహిళా రైతు పలివెల లక్ష్మి ఒకటిన్నర ఎకరాలో పొలంలో ఖరీఫ్ వరి పంటను కోసి కుప్పగా వేసింది. దీని పక్కనే గ్రామానికి చెందిన అత్తి అప్పలరాజు పశుగ్రాసం కోసం గడ్డిమేటు వేశారు. ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా వరికుప్ప నుంచి మంటలు రావడంతో స్థానికులు గమనించి తుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చే లోపు గ్రామ సర్పంచ్ కటకం శివ, గ్రామ రైతులు నీటితో మంటలు ఆర్పేందుకు విఫలయత్నం చేశారు. ఈదురు గాలుల వీయడంతో క్షణాల్లో మంటలు చెలరేగి వరికుప్ప, గడ్డివాము కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష ఆస్తినష్టం జరిగిందని బాధితులు తెలిపారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



కత్తిపూడిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని కత్తిపూడి గ్రామ సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు. సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేసి క్లోరినేషన్ చేశారు. గ్రామాన్ని వ్యర్థరహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని సర్పంచ్ కోరారు.

డిమాండ్లు నెరవేర్చాలని మత్స్యకారుల నిరసన



పెరుమాళ్లపురంలో మత్స్యకారులతో చర్చిస్తున్న పోర్టు ప్రతినిధులు

తొండంగి: తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ మండలంలోని పెరుమాళ్లపురంలో పోర్టు నిర్మాణం వద్ద ఆదివారం మత్స్యకారులు నిరసన తెలిపారు. పోర్టు యాజమాన్యం గతంలో తమకు ఉపాధి కల్పిస్తామని, నష్టపరిహారం ఇస్తామని హామీ ఇచ్చిందని మత్స్యకారులు తెలిపారు. దీనిలో భాగంగా కొద్ది మందికి పరిహారం అందాల్సి ఉందన్నారు. ఈ మేరకు పోర్టు ప్రాంతంలో పనులను అడ్డుకున్నారు. పోర్టు ప్రతినిధులు స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. సమస్య రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి వెళ్లడంతో మత్స్యకారుల సమస్యల పరిష్కారనికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. దీంతో మత్స్యకారులు నిరసన విరమించారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు



బొర్రంపాలెం వద్ద డివైడర్‌పై నిలిచిన కారు

గండేపల్లి: జాతీయ రహదారిపై మండలంలోని బొర్రంపాలెం వద్ద ఆదివారం డివైడర్‌పైకి కారు దూసుకెళ్లింది. హైవే మెయింటినెన్స్, రోడ్ సేఫ్టీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన దెందుకూరు శివరామకృష్ణరాజు తన కారును డ్రైవింగ్ చేసుకుంటూ విశాఖపట్నం వెళ్లి వస్తున్నాడు. మండలంలోని బొర్రంపాలెం సమీపంలోని పెట్రోల్ బంక్ వద్దకు వచ్చే సరికి లారీని తప్పించే క్రమంలో కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవింగ్ చేస్తున్న శివరామకృష్ణరాజుకు ఎటువంటి గాయాలు కాలేదన్నారు. కారు ముందుభాగం దెబ్బతింది. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని గండేపల్లి పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



బలరామపురం వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన వీరబాబు

రౌతులపూడి: మండలంలోని రౌతులపూడి-కొట్టాం రహదారిలో బలరామపురం వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో ఎస్.పైడిపాలకు చెందిన కొరుప్రోలు వీరబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. వీరబాబు తన స్వగ్రామం ఎస్.పైడిపాల నుంచి ములగపూడిలోని అత్తవారి ఇంటికి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా బలరామపురం వద్ద చేల్లో పనులు ముగించుకుని పుల్లల మోపు, కావిడతో ఇంటికి వెళ్తున్న జిగిరెడ్డి నూకరాజు అనే వ్యక్తిని ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. తలకు గాయం కావడంతో తీవ్ర రక్తం స్రావమైంది. అపస్మారక స్థితిలో ఉన్న వీరబాబును స్థానికులు మెరుగైన వైద్యం కోసం 108లో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మురుగు సమస్యకు మోక్షం

కోటనందూరు: స్థానిక తుని–నర్సీపట్నం రోడ్డులో దీర్ఘకాలంగా ఉన్న మురుగునీటి సమస్యకు మోక్షం కలిగింది. గ్రామ సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి, ఈఓపీఆర్డీ జి.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు మురుగు సమస్యను పరిష్కరించారు. ఈ రోడ్డును ఆనుకొని ఉన్న నివాసితులకు వాడకం నీటిని రోడ్డుపైకి విడిచి పెట్టొద్దని తొలుత నోటీసులు ఇచ్చారు. అయినా రోడ్డుపైకి నీటిని వదలడంతో ఆదివారం ఆ పైపులను మూసేశారు. ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతను తవ్వించి అందులోకి మాత్రమే నీటిని విడిచి పెట్టాలని సూచించారు. ఇకమీదట మురుగునీటిని రోడ్డుపైకి విడిచిపెడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, కురందాసు రాంబాబు, మళ్ల సూర్యచంద్ర పాల్గొన్నారు.

దేశంలో బీజేపీని గద్దె దించాలి

తుని: ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీని గద్దె దించేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి పని చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పోలిట్‌బ్యూరో సభ్యుడు స్వదేశీ భట్టాచార్యా పిలుపునిచ్చారు. స్థానిక సమయమంతుల సోమరాజు ఫంక్షన్ హాలులో ఆదివారం సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రస్తుతం దేశంలో ప్రజా సమస్యలను పక్కనబెట్టి ఫాసిస్టు విధానాలను అమలు చేస్తోందని మండిపడ్డారు. దేశంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్య, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ప్రధాని మోదీ ప్రజాసంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతన్నారని ఆరోపించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి నైనాలశెట్టి మూర్తి, కేంద్ర కమిటీ సభ్యులు బుగత బంగార్రాజు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

జగ్గంపేట: స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతులు పండించే అన్ని పంటలకూ కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మాండవ దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన అఖిల భారత రైతు కూలీ సంఘం నేతలతో కలిసి జగ్గంపేట, గోకవరం, పెద్దాపురం మండలాల్లో వివిధ పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది అధిక వర్షాలు, తుపానుల కారణంగా రైతులు నష్టపోయారన్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు జె.సత్తిబాబు, పి.సోమన్న, డివిజన్ నాయకులు కె.రామలింగేశ్వరరావు, పి.పాపన్న తదితరులు పాల్గొన్నారు.